తెరిపివ్వని వాన

- తడిసి ముద్దయిన రహదారులు
- ఇబ్బందులు పడిన ప్రజలు
- మూతపడిన చిరు వ్యాపారాలు


ఎన్జీజీవోస్ కాలనీలో కూలిన చెట్టు


వర్షం కారణంగా జన సంచారం లేని మహారాణి పార్లర్ కూడలి

సీతంపేట: అల్పపీడన ప్రభావంతో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి నియోజకవర్గం తడిసి ముద్దయింది. శుక్రవారం రోజంతా వర్షం కురవడంతో కాలు బయటపెట్టే వీలు లేక చాలా వరకు జనం ఇళ్లకే పరిమితమయ్యారు. దీంతో రహదారులు ఖాళీగా దర్శనమిచ్చాయి. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు వచ్చాక ఈ స్థాయిలో వర్షం పడటం ఇదే తొలిసారి. ఇప్పటి వరకు ఎండ, ఉక్కపోతతో సతమతమైన ప్రజలు ఆహ్లాదకరమైన వాతావరణంలో సేదతీరారు. రోజంతా వాన కురవడంతో జనం అవస్థల పాలయ్యారు. ముఖ్యంగా పాఠశాలలకు వెళ్లే చిన్నారులు, కళాశాల విద్యార్థులు వర్షంతో ఇబ్బంది పడ్డారు. ఆ తర్వాత స్కూళ్లకు సెలవు ప్రకటించడంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. అత్యవసర పనులపై బయటకు వచ్చిన వారు గొడుగులు, రెయిన్‌కోట్లు ధరించి పనులు చక్కబెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎడతెరిపి లేని వర్షంతో చిరు వ్యాపారాలు చాలా వరకు మూతపడ్డాయి. తెరిచిన కొద్ది పాటి వ్యాపారాలు బేరాలు లేక, వ్యాపారాలు సాగక చిరు, తోపుడుబళ్ల వ్యాపారులు ఉసూరుమన్నారు.

ఖాళీగా రైతుబజారు

కొనుగోలుదారులు లేక నరసింహనగర్ రైతుబజార్ ఖాళీగా దర్శనమిచ్చింది. తెచ్చిన సరకు అమ్ముడుపోలేదని, గిట్టుబాటు కాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏకధాటిగా కురిసిన వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. డ్రెయిన్లు, గెడ్డల్లో వర్షపు నీరు పొంగి పొర్లి ప్రవహించాయి. వర్షం దాటికి ఎన్జీజీవోస్ కాలనీ శ్రీరంగసామ్రాజ్యం అపార్ట్‌మెంట్ వద్ద చెట్టు కూలింది. దీంతో కేబుల్ వైర్లు తెగిపడ్డాయి. ఈ సమయంలో జన సంచారం లేకపోవడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదని జనం ఊపిరి పీల్చుకున్నారు.

జోరువానలో ప్రయాణికుల పాట్లు


మురళీనగర్: మురళీనగర్ పరిసర ప్రాంతాల్లో గురువారం నుంచి కురుస్తున్న వర్షాల కారణంగా వరద నీరు పోటెత్తింది. జాతీయ రహదారితోపాటు సర్వీస్ రోడ్లలో గెడ్డల మాదిరిగా నీరు ప్రవహించడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు నానా అవస్థలు పడ్డారు. వర్షాల సమయంలో ఆర్టీసీ బస్సులు నిర్దేశించిన బస్‌స్టాపుల్లో ఆపకపోవడంతో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ ఎదురుగా సత్యానగర్ వద్ద బస్‌స్టాప్ ఉన్నప్పటికీ 28జెడ్ ఆర్డినరీ బస్సు ఆపలేదని పలువురు ఆరోపించారు. దీంతో కాలేజీలకు, కార్యాలయాలకు విద్యార్థులు, ఉద్యోగులు సకాలంలో చేరుకోలేకపోయారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేద్దామన్నా ఫోన్ చేసినా పట్టించుకోలేదని చెప్పారు. వర్షాల్లో తడిసి బస్సుల కోసం వేచి ఉంటే బస్సులు ఆపకపోవడమేంటని వారు ప్రశ్నిస్తున్నారు. ఎడతెరిపి లేకుండా వాన కురవడంతో మాధవధార, ఏఎస్సార్ నగర్‌లోని జీవీఎంసీ హైస్కూళ్లు, మాధవధార, బర్మా క్యాంపు కాలనీల్లోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలకు సెలవు ప్రకటించారు.


సత్యానగర్ వద్ద సర్వీస్ రోడ్డుపై పోటెత్తిన వర్షపు నీరు


మురళీనగర్‌లో కురుస్తున్న వర్షం


అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డులో తెరుచుకోని చిరు వ్యాపారాలు

జలధార కళకళ


మాధవ స్వామి ఆలయ మెట్ల మీద నుంచి నీటి ప్రవాహం

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు మాధవధార మాధవ స్వామి ఆలయం వద్ద నీటి ప్రవాహంతో జలధార కళకళలాడుతోంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కొండ పైనుంచి నీరు చేరుకోవడంతో ఆలయ మెట్ల మార్గం మీదుగా శుక్రవారం ధార ప్రవహించింది. స్థానికులు అక్కడికి చేరుకుని జలధారను ఉత్సాహంగా వీక్షించారు. గతేడాది వేసవిలో నీరు లేక చిన్నపాటి ధార మాత్రమే వచ్చేదని, ఇటీవల కురుస్తున్న వర్షాల ధాటికి పెద్ద ఎత్తున నీరు ప్రవహించడం ఆనందంగా ఉందని స్థానికులు చెబుతున్నారు.

వైభవుడికి సుప్రభాత సేవ నేడు

మురళీనగర్: కప్పరాడ ఎన్జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్ర నామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరుగుతాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

స్వీయ ప్రేరణతో విజయం తథ్యం


సదస్సులో పాల్గొన్న అతిథులు

మల్కాపురం: జీవితంలో విజయం సాధించడానికి స్వీయ ప్రేరణ ఎంతో అవసరమని సీనియర్ హిందీ అధ్యాపకురాలు ఎ.ఆదిలక్ష్మి అన్నారు. మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో కొత్తగా చేరిన విద్యార్థినులతో శుక్రవారం ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థినులు విజయాన్ని సాధించాలనే తపనతో పాటు అవకాశాలను సృష్టించుకో గల శక్తి కూడా కలిగి ఉండాలన్నారు. అడ్డంకులను అధిగమించినప్పుడే దృఢమైన వ్యక్తిత్వం ఏర్పడుతుందని చెప్పారు. ఇతరుల ప్రోత్సాహం కంటే స్వీయ ప్రేరణ మనలను విజయ శిఖరాలకు చేరుస్తుందన్నారు. అనంతరం మూడు రోజులుగా కళాశాల ఆవరణలో వ్యక్తిత్వ వికాసం, మహిళా సాధికారతపై జరిగిన సదస్సుల ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అతిథులకు కళాశాల యాజమాన్యం జ్ఞాపికలను అందించింది. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కేస్లిన్, సదస్సు కో ఆర్డినేటర్లు ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి, ప్రేమలత, డాక్టర్ ప్రశాంతి, అంజలి దేవి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైతుబజారు స్టాళ్లకు డ్రా


రైతులకు స్టాళ్ల టోకెన్లు అందిస్తున్న ఈవో కొండబాబు

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజారులోని స్టాళ్లకు శుక్రవారం ఈవో కొండబాబు డ్రా తీసి, రైతులకు టోకెన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ మార్కెటింగ్ శాఖ అధికారుల ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం 150 మంది రైతుల కార్డులకు సంబంధించి స్టాళ్లకు డ్రా తీస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతుబజార్ సహాయకుడు సతీష్, రైతులు పాల్గొన్నారు.

దోమల వృద్ధిని అరికడదాం


హరిజన వీధిలో నీటి నిల్వలను పరిశీలిస్తున్న మలేరియా అధికారి నగేష్

సీతంపేట: వర్షా కాలంలో డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా జ్వరాలు వ్యాప్తి చెందకుండా అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ నగేష్ పట్నాయక్ అన్నారు. జీవీఎంసీ 25వ వార్డు హరిజన వీధి సచివాలయం పరిధిలో శుక్రవారం ఫ్రైడే–డ్రైడే అమలు తీరును, ఇంటింటికీ వెళ్లి నీటి నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలని, నీటి నిల్వలను పారబోసి మళ్లీ పట్టుకోవాలని స్థానికులకు అవగాహన కల్పించారు. ఫ్రైడే–డ్రైడేను పూర్తి స్థాయిలో అమలు చేయడం ద్వారా దోమల వృద్ధిని అరికట్టడం తద్వారా డెంగ్యూ, మలేరియా జ్వరాలను నియంత్రించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ కె.ఎస్.ఎస్.రెడ్డి, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రైల్వే కో–ఆపరేటివ్ బ్యాంకు ఎన్నికల బరిలో గోవిందరావు


జి.గోవిందరావు

తాటిచెట్లపాలెం: రైల్వే కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ఎన్నికల్లో డెలిగేట్‌గా పోటీ చేస్తున్న తనను గెలిపించాలని ఐఎన్‌టీయూసీ విశాఖ జిల్లా యూత్ ప్రెసిడెంట్ జి.గోవిందరావు ఓ ప్రకటనలో కోరారు. వాల్తేర్ డివిజన్‌లో ట్రాక్‌మన్‌గా విధులు నిర్వర్తిస్తూ 38 సార్లు రక్తదానం చేయడంతో పాటు పేద కార్మికులకు ఎంతో సహాయం చేశానని పేర్కొన్నారు. ఈ నెల 24న జరగనున్న ఎన్నికల్లో ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ సహకారంతో డెలిగేట్‌గా పోటీ చేస్తున్నానని ఆయన తెలిపారు. రైల్వే కార్మికులు, ఉద్యోగులు 2వ నంబర్‌పై ఓటు వేసి తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

‘ఉక్కు’లో పరిస్థితులు ఆందోళనకరం

అగనంపూడి: విశాఖ ఉక్కు కర్మాగారంలో నెలకొంటున్న పరిస్థితులు ఆందోళన కల్గిస్తున్నాయని ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, వి.శ్రీనివాసరావు, గంగవరం గోపీ అన్నారు. ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే దీక్షల్లో 1254వ రోజు, శుక్రవారం వారు మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని ఏళ్ల నుంచి కోరుతున్నా ప్రభుత్వాలు పట్టనట్టు వ్యవహరిస్తుండడం బాధాకరమన్నారు. ఉత్పత్తి, ఉత్పాదకత, భద్రతా ప్రమాణాలు, ఆర్థిక పరిస్థితి, ముడిసరకు.. ఇలా అన్ని విధాలా ఉక్కును అష్ట దిగ్బంధనం చేసి ఊపిరాడకుండా చేయడం ద్వారా ‘ప్రైవేటీకరణ చేసేయండి’ అని కార్మికులు, స్థానికులే చెప్పే పరిస్థితికి తీసుకువెళ్తున్నారన్నారు. ప్రభుత్వాలు ఎన్ని కుట్రలు పన్నినా, ఎన్ని కుయుక్తులు వేసినా విశాఖ ఉక్కును కాపాడుకుంటామన్నారు.

గిరిప్రదక్షిణకు పక్కాగా బందోబస్తు


బందోబస్తు ఏర్పాట్లపై పోలీసులకు సూచనలిస్తున్న ఈస్ట్ ఏసీపీ జయరాం ప్రసాద్

సీతమ్మధార: ఈ నెల 20వ తేదీ శనివారం జరగనున్న సింహాచలం గిరిప్రదక్షిణకు పక్కాగా బందోబస్తు చర్యలు చేపట్టారు. ఈస్ట్ సబ్ డివిజన్‌కు సంబంధించి ఈస్ట్ ఏసీపీ బి.ఎం.జయరాం ప్రసాద్ ఆధ్వర్యంలో 100 మందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఫోర్త్‌టౌన్ సీఐ ఎస్.విజయకుమార్, టూటౌన్ సీఐ తిరుమలరావు, మహారాణిపేట సీఐ పి.శ్రీనివాసరావు, విజయనగరం రెండో పట్టణ సీఐ కోరాడ రామారావుతోపాటు పది మంది ఎస్‌ఐలు జి.వెంకటరావు, బి.ప్రమీలా, ఎం.సూర్యారావు, పి.అప్పలనాయుడు, ఆర్.శంకరరావు, కె.సతీష్, మరో నలుగురితోపాటు 90 మంది సిబ్బంది బందోబస్తు విధుల్లో ఉంటారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని బాలికల పాపా హోం జంక్షన్ నుంచి పోర్టు హైస్కూల్ వరకు, మద్దిలపాలెం జంక్షన్ నుంచి తాటిచెట్లపాలెం వరకు పోలీస్ బందోబస్తు ఉంటుంది. ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు సలహాలు ఇచ్చేందుకు రెండు టీమ్‌లు పర్యవేక్షిస్తుంటాయి. ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా, అసౌకర్యాలు కలగకుండా, నేరాలు జరగకుండా చర్యలు చేపడుతున్నారు. రెండు మూవింగ్ పార్టీలు, రెండు రోప్ పార్టీలు ఉదయం, సాయంత్రం వేళల్లో షిఫ్టులుగా విధులు నిర్వహిస్తారు. పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ కోసం రెండు పార్టీలు పాపా హోం జంక్షన్, నరసింహ నగర్ జంక్షన్‌లో సూచనలు, సలహాలు ఇవ్వనున్నారు. ప్రతి జంక్షన్‌లో సీసీ కెమెరాలు, లైట్లు, ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

గిరిప్రదక్షిణ సందర్భంగా శుక్రవారం బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని సింధూర గెస్ట్ హౌస్‌లో పోలీసులతో ఈస్ట్ ఏసీపీ బి.ఎం.జయరాం ప్రసాద్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు గిరిప్రదక్షిణ చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడటంతోపాటు నేరాలు జరగకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. భక్తులకు ఎటువంటి కష్టం వచ్చినా పోలీస్ యంత్రాంగం పర్యవేక్షిస్తుంటుందని చెప్పారు. సెల్‌ఫోన్‌లు, నగదు, బంగారు ఆభరణాల భద్రతపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందులు రానీయొద్దు


జోరువానలో గిరిప్రదక్షిణ ఏర్పాట్లను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

డాబాగార్డెన్స్: సింహగిరి ప్రదక్షిణ మార్గంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సింహాచలం తొలి పావంచా నుంచి అడవివరం, హనుమంతువాక, విశాలాక్షీనగర్, అప్పుఘర్, ఇసుకతోట, సీతమ్మధార, మాధవధార, గోపాలపట్నం మీదుగా గిరి ప్రదక్షిణలో పాల్గొనే భక్తులు వెళ్లే మార్గాన్ని జీవీఎంసీ అదనపు కమిషనర్ కేఎస్ విశ్వనాథన్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గిరి ప్రదక్షిణలో లక్షలాది మంది భక్తులు పాల్గొంటారని, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. పారిశుధ్యం, తాగునీరు, ఓఆర్ఎస్, ప్రథమ చికిత్స కేంద్రాలు, మరుగుదొడ్లు, విద్యుత్ దీపాలు వంటి ఏర్పాట్లపై మేయర్‌కు అదనపు కమిషనర్ విశ్వనాథన్ వివరించారు. పారిశుధ్య నిర్వహణకు అవసరమైన కార్మికులను అందుబాటులో ఉంచామన్నారు. తాత్కాలిక మరుగుదొడ్లు, లుంబినీ పార్కు సమీప బీచ్‌లో స్నానమాచరించే భక్తులు దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆయన చెప్పారు. బీచ్‌లో లైఫ్‌గార్డ్స్‌ను నియమించామన్నారు. స్వచ్ఛంద సంస్థలు, పలు సేవా సంఘాలకు స్టాళ్ల ఏర్పాటుకు స్థలాలు సూచించామని, ఆహార పదార్థాలు ప్లాస్టిక్‌లో కాకుండా ఆకులు, కాగితంతో తయారు చేసిన ప్లేట్లలో అందించాలని సూచించినట్టు ఆయన తెలిపారు. ప్రసాదం కౌంటర్ల వద్ద, నడక మార్గంలో ఎక్కడికక్కడ డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేశామని అదనపు కమిషనర్ మేయర్‌కు వివరించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, ప్రధాన ఇంజినీరు రవికృష్ణరాజు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

భక్తులకు ఉచిత వైద్య సేవలు


సమావేశంలో పాల్గొన్న గౌరీ సంక్షేమ సేవా సమితి సభ్యులు

కంచరపాలెం: శ్రీవరాహ లక్ష్మీనరసింహ స్వామి గిరి ప్రదక్షిణను పురస్కరించుకుని శ్రీ గౌరీ సంక్షేమ సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం భక్తుల కోసం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు సమితి అధ్యక్ష, కార్యదర్శులు పి.రాజీ, కె.వి.ప్రసాద్ తెలిపారు. ఊర్వశి జంక్షన్‌లోని గౌరీ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన సేవా సమితి నూతన కార్యవర్గ సమావేశంలో ఈమేరకు నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. కాలి నడకన వెళ్లే భక్తులకు కీళ్లు, ఒళ్లు నొప్పులు వచ్చే అవకాశాలు ఉంటాయని, అందు కోసం పోర్ట్ స్టేడియం వెనుక 60 అడుగుల రోడ్డు వసంత విహార్ దగ్గర ఉన్న పాపా హోమ్ సమీపంలోని ఆర్ఆర్ గ్రాండ్ అపార్ట్‌మెంట్ ఎదురుగా శిబిరం ఏర్పాటు చేస్తున్నామన్నారు. శనివారం సాయంత్రం 6 గంటల నుంచి వైద్య శిబిరం ప్రారంభమవుతుందని, భక్తులకు ఆయింట్‌మెంట్‌లు, మందులు, ఎనర్జీ డ్రింక్‌లను పంపిణీ చేస్తామని చెప్పారు. గౌరీ మాత భక్తులు, గవర కమ్యూనిటీ వారంతా పాల్గొని విజయవంతం చేయాలని అధ్యక్ష, కార్యదర్శులు కోరారర. కార్యక్రమంలో కమిటీ కోశాధికారి వేగి సత్యనారాయణ, సభ్యులు పాల్గొన్నారు.

జోరుగా సబ్సిడీ టమాటా విక్రయాలు


సీతమ్మధార రైతుబజారులో టమాటాలు విక్రయిస్తున్న రైతు


నరసింహనగర్ రైతుబజార్‌లో టమాటాల విక్రయాన్ని పరిశీలిస్తున్న ఏడీఎం యాసిన్

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజారులో శుక్రవారం 100 కిలోల టమాటాలు విక్రయించారు. టమాటా ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో చిత్తూరు జిల్లా నుంచి కొనుగోలు చేసిన టమాటాలను శుక్రవారం నుంచి సీతమ్మధార రైతుబజారులో విక్రయించడం ప్రారంభించారు. 8 కౌంటర్ల ద్వారా కిలో రూ.58 చొప్పున టమాటాలు విక్రయిస్తున్నారు. గురువారం సాయంత్రం నుంచి వర్షం కురుస్తుండటంతో వినియోగదారులు అంతగా రాకపోవడంతో వంద కిలోల వరకు టమాటా విక్రయించారు. హోల్‌సేల్ మార్కెట్‌లో కూడా కిలో టమాటా రూ.58కు లభ్యమవుతోంది. దీంతో చిరు వ్యాపారులు హోల్‌సేల్ మార్కెట్‌కు వెళ్తున్నారు.

టమాటా విక్రయాల పరిశీలన

సీతంపేట: నరసింహనగర్ రైతుబజార్‌లో శుక్రవారం సబ్సిడీపై టమాటా విక్రయాలు ప్రారంభించారు. కిలో రూ.58 చొప్పున డ్వాక్రా వ్యాపారులు విక్రయించారు. మార్కెటింగ్ శాఖ ఏడీఎం ఎస్.కె. యాసిన్ విక్రయాలను పర్యవేక్షించారు. బజార్‌లో ఏర్పాటు చేసిన 5 కౌంటర్లలో 1,300 కేజీలు విక్రయించినట్టు బజార్ ఎస్టేట్ ఆఫీసర్ పి.చినబాబు తెలిపారు. సబ్సిడీ విక్రయాలతోపాటు హోల్‌సేల్ మార్కెట్ నుంచి వచ్చిన సరకు కూడా కిలో రూ.58 చొప్పున పది క్వింటాలు విక్రయించినట్టు చెప్పారు. హోల్‌సేల్ మార్కెట్‌లో కిలో రూ.68 ఉండగా, సబ్సిడీ టమాటా రైతుబజార్‌కు పెద్ద ఎత్తున రావడంతో హోల్‌సేల్ వర్తకులు ధర తగ్గించి విక్రయించారన్నారు. శనివారం కూడా సబ్సిడీపై టమాటా విక్రయిస్తామని, 39 క్వింటాళ్లు ప్రస్తుతం బజార్‌లో అందుబాటులో ఉందన్నారు. మనిషికి రెండు కిలోల వరకు విక్రయిస్తామన్నారు.

బాలిక అదృశ్యం

మద్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో 14 ఏళ్ల బాలిక అదృశ్యమైన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. అల్లిపురం అమ్మవారి వీధిలో తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్న బెహరా రేష్మ జ్ఞానాపురంలోని ఓ ఎయిడెడ్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతోంది. ఈ నెల 18న రోజూ మాదిరి స్కూల్‌కు వెళ్లిన రేష్మ.. తిరిగి ఇంటికి చేరుకోలేదు. కుటుంబ సభ్యులు అంతటా వెతికినా ప్రయోజనం లేకపోవడంతో గురువారం రాత్రి కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో తల్లి బెహరా కనకమహాలక్ష్మి ఫిర్యాదు చేశారు. సీఐ ఎస్.భాస్కరరావు నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ నరసింహమూర్తి కేసు దర్యాప్తు చేపట్టారు. బాలిక 5 అడుగుల ఎత్తు, తెలుపు రంగు ఛాయ కలిగి ఉంది. అదృశ్యమైన సమయంలో స్కూల్ డ్రెస్‌లో బ్యాగుతో ఉంది. రేష్మ సమాచారం తెలిసిన వారు ఐదో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు.

స్టీల్ కార్మికులకు తక్షణం వేతనాలు చెల్లించాలి

ఉక్కునగరం: స్టీల్ కార్మికులకు తక్షణం వేతనాలు చెల్లించాలని స్టీల్ సీఐటీయూ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి డిమాండ్ చేశారు. సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్ని నెలలుగా స్టీల్ కార్మికులకు వేతనాలు చెల్లించడంలో యాజమాన్యం దుర్మార్గమైన వైఖరి అవలంభిస్తోందన్నారు. వెంటనే సగం జీతాన్ని చెల్లించకుంటే తీవ్ర పరిణామాలు ఎదురోవాల్సి వస్తుందని హెచ్చరించారు. వై.టి. దాస్, పి. శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

గురుపౌర్ణమి వేడుకలకు సిద్ధం


ధ్యాన మందిరంలో సాయిబాబా


రైల్వే న్యూకాలనీలో గురుపౌర్ణమి వేడుకలకు సిద్ధమైన షిర్డీసాయిబాబా ధ్యాన మందిరం

- ముస్తాబైన రైల్వే న్యూకాలనీ షిర్డీసాయి ధ్యాన మందిరం

తాటిచెట్లపాలెం: ఈ నెల 21న జరగనున్న గురుపౌర్ణమి మహా వేడుకలకు రైల్వే న్యూకాలనీ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరం సిద్ధమవుతోంది. 1994 నుంచి ఏటా ఇక్కడ గురుపౌర్ణమి పర్వదినాన ప్రత్యేక పూజలు, మహా అన్నదానం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ధ్యాన మందిరాన్ని ప్రత్యేకంగా పెయింటింగ్స్, విద్యుద్దీపాలంకరణతో ముస్తాబు చేశారు. 21వ తేదీ ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు, సుమారు 6 వేల మందికి అన్నదానం చేస్తున్నట్లు ధ్యాన మందిర వ్యవస్థాపక అధ్యక్షులు నూకల శేషగిరిరావు, త్రిపురాన రాంబాబు తెలిపారు. భక్తులు, దాతల సహకారంతో నిరంతరాయంగా ప్రత్యేక కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని చెప్పారు.

గురుపౌర్ణమి పర్వదినాన ప్రత్యేక కార్యక్రమాలు

- ఆదివారం ఉదయం 8 గంటల నుంచి భక్తుల స్వహస్తాలతో సాయిబాబాకు అభిషేకాలు.
- సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు అర్ధ ఏకాహం(భజన).
- ఉదయం 11 గంటల నుంచి రాత్రి శేజ్ హారతి వరకు వచ్చిన భక్తులందరికీ అన్నప్రసాద వితరణ.
- రాత్రి 7 గంటలకు సాయిబాబా పల్లకీ సేవ (మహిళలకు ప్రత్యేక అవకాశం).
- షిర్డీ నుంచి తీసుకొచ్చిన విభూది, కంకణాలను, కాశీ, హరిద్వారల నుంచి తీసుకొచ్చిన పంచముఖ రుద్రాక్షలను భక్తులందరికీ ఉచితంగా పంపిణీ చేస్తారు.

ఆదాయ పన్నుపై అవగాహన


మాట్లాడుతున్న ఐటీ అధికారులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో శుక్రవారం ఆదాయ పన్నుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉక్కు పరిపాలన భవనంలోని ప్రధాన కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో పన్ను వర్తింపు, సడలింపునకు సంబంధించి ఆదాయ పన్ను శాఖలో ఇటీవల జరిగిన విశేషమైన మార్పులు, పరిణామాల గురించి ఐటీ డిప్యూటీ కమిషనర్ ఐ.మధుసూదనరావు, అసిస్టెంట్ కమిషనర్ పి.వి.శేషగిరిరావు వివరించారు. ఈ–ఫైలింగ్ చేయడం, డిజిటలైజేషన్ ప్రక్రియ, ముందుగా పూరించిన రిటర్న్‌లలో ప్రతిబింబించే ఆర్థిక సమాచారాన్ని సేకరించడం, డేటా సేకరణ, అప్పీళ్ల దాఖలు, ఆదాయ పన్ను కార్యాలయం సందర్శించకుండా తీసుకున్న వివిధ పద్ధతుల గురించి తెలిపారు. స్టీల్‌ప్లాంట్ సీజీఎం (ఫైనాన్స్) వి.శాంతకుమార్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు ఐటీ రిటర్న్‌లను సమర్పించడానికి ఆదాయ పన్ను అధికారులతో సంభాషించడానికి ఇది మంచి అవకాశమన్నారు. ఆదాయపు పన్ను శాఖ అధికారులు పలు సందేహాలను నివృత్తి చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రాజెక్ట్స్ సీజీఎం ఇన్‌చార్జి డాక్టర్ వి.ఆర్.బాపారావు తదితరులు పాల్గొన్నారు.